# 5. అంతర్యం

బంధువుల ఇళ్ళకు వెళ్ళటం నాకు బొత్తిగా ఇష్టంలేదు. అందులోనూ రెండు, మూడు రోజులు వుండాల్సిన పని. యీ రేషన్ రోజుల్లో పట్టణాల్లో వున్న యెంత దగ్గరి బంధువుల ఇళ్ళకు వెళ్ళినా వాళ్ళను అనవసరంగా శ్రమపెట్టటమే అవుతుందని నాకు తెలియకపోలేదు.

కాని మా ఆవిడ మరీమరీ చెప్పింది.

"సత్యవతీ వాళ్ళింటికి వెళ్ళి వుండండి. ఇంకెక్కడన్నా ఉంటే వాళ్ళేమన్నా అనుకుంటారు--"

"అనుకోనీ నాకేం?" అన్నాను.

"అది కాదండీ - అదేమన్నా పరాయిదా? మా పింతల్లి కూతురు. ఆ మధ్య కంటి వైద్యానికని ఇక్కడికొచ్చి నెల రోజులు వున్నారా? మరి వాళ్ళ వూరు వెళ్ళినప్పుడు రెండు మూడు రోజుల భాగ్యానికి మీరు వాళ్ళింటికి వెళ్ళకపోవటమేమిటి?"

"చూద్దాంలే" అన్నాను, వాదన పెంచేందుకు ఇష్టంలేక.

"చూద్దాంలే అంటే కాదు...తప్పకుండా వెళ్ళాలి. దాని మొగుడు కూడా మీకు బాగా తెలుసాయె. వాళ్ళ దొడ్లో ఎన్నో ఇంగ్లీషు పూలమొక్క లున్నయ్యట. వొచ్చేప్పుడు ఆ గింజలు తీసుకురండి..." అందామె.

తలూపి బైటపడ్డాను.

రైల్లో కూర్చున్నంతసేపూ యీ విషయాన్ని గూర్చి ఆలోచించలేదు కాని స్టేషన్‌లో దిగాక వెళ్ళటమా మానటమా అనే సమస్య వేధించింది. నెల రోజుల పాటు వాళ్ళు

మా ఇంట్లోనే వున్న మాట నిజం! ఐనా కూడా వాళ్ళింటికి వెళ్ళకుండా వుండటమే నాకు తృప్తి! వెళ్ళకుండానే వెళ్ళానని మా ఆవిడతో చెప్పితే సరిపోతుంది. కాని ఆమె పూల మొక్కల తాలూకు గింజలు తెమ్మని పురమాయించింది. వెళ్ళకుండా వెళ్ళానంటే దొరికిపోతాను.

ఆలోచనలు తెగకముందే జట్కాలో ఎక్కాను. జట్కా కొంత దూరం సాగాక "ఎటుపోనిమ్మంటారు?" అన్నాడు బండివాడు.

ఆలోచన తెగక తప్పలేదు.

"కొత్తపేట పోనీ" అన్నాను.

వాళ్లిల్లెక్కడో సరిగా తెలియదు. పేటపేటంతా గాలించాల్సి వొచ్చింది. యీ అవస్థతో తలనొప్పి వచ్చి మధ్యలో ఏ హోటలుకో వెళ్ళిపోదా మనుకున్నాను. కాని ఇంత దూరం వొచ్చాక ఇల్లు కనుక్కోలేకపోయినకొద్దీ కనుక్కోవాలనే పట్టుదల మరీ హెచ్చింది. చివరకు ఇల్లు కనుక్కున్నాను....

బండి దిగుతూండగానే ఒక ముసలమ్మ నన్ను పరిశీలనగా చూసి "రా నాయనా" అని ఆహ్వానించింది. యీమె ఎవరో నాకు తెలియదు, కాని నే నామెకు తెలిసి వుంటాను. ఐనప్పటికీ యీమె ఆహ్వానం నా కంతగా రుచించక, ఇంట్లోకి వెళ్ళటమా, మానటమా అని ఆలోచిస్తున్నాను.

నా అవస్థను పాపం ఆమె అర్థం చేసుకుంది. "సత్యవతీ! సత్యవతీ! మీ బావగారొచ్చారు. కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళు తీసుకురా--" అని కేక వేసింది.

సత్యవతి నీళ్ళ చెంబుతో నవ్వు మొహంతో వచ్చింది. కాళ్ళు కడుక్కొని సామాను ఇంట్లో పెట్టించి బండివాడితో పోట్లాట జరక్కుండా వొదిలించుకొని స్థిమితంగా కూర్చున్నాను.

"అక్కయ్యా, పిల్లలూ కులాసాయేనా?" అంది సత్యవతి.

"ఆఁ" అన్నాను.

"మెద్రాసునుంచేనా రావటం?" అందామె.

"ఔను."

ఇవే ప్రశ్నలు వేద్దామనుకున్నదేమో ముసలమ్మ జవాబులు విన్నాక తృప్తిగా ఇంట్లోకి వెళ్ళింది.

"గోపాలం ఏడీ?" అన్నాను.

"వొస్తారు..." అందామె.

నెల రోజులు ఆమె మా ఇంట్లో వున్నా ఆమెను ఏనాడన్నా సరిగా చూడనన్నా చూడలేదు. నా అడుగుల సవ్వడి విని ఆమె చాటుకు పొయ్యేది. అంత సిగ్గున్న ఆడదాన్ని నేను అంతకుపూర్వం ఎరగను. ఇక యీ నాడు ఆమె ఎంతో ఆత్మీయురాలల్లే మాట్లాడుతోంది. గోపాలం లేని సమయంలో ఆమె మాట్లాడకుంటే నాకు మరీ అవస్థయిపొయ్యేది.

"స్నానం చేస్తారా?" అందామె.

తలూపాను. నీళ్ళుతోడొచ్చి - రమ్మంది.

స్నానం చేసి వొచ్చాను. సావిట్లో కూర్చొని పాత పుస్తకాలు తిరగేస్తున్నాను. ఆమె కాఫీ ఫలహారాలు తెచ్చింది. తీసుకున్నాను. కాని ఇలా ఎంతసేపు కూర్చోనూ? ఆమె వంటింట్లో పని చూసుకుంటోంది. ముసలమ్మ వొచ్చి నా ఎదురుగా కూర్చొని ఇక్ష్వాకులనాటి కబుర్లు మొదలు పెట్టింది. నా భార్య తరపు బంధువుల్ని గూర్చి చెప్పసాగింది. ఇదంతా వ్యర్థ సంభాషణే ఐనప్పటికీ, నాకు బొత్తిగా కుతూహలం లేదు సరికదా సన్నగా తలనొప్పి ప్రారంభమైంది. సాయంత్రం దాకా నాకు పని లేకపోయినా, ముందు ఇక్కణ్నుంచి బైటపడాలనే ఉద్దేశ్యంతో "అల్లా బజారు వెళ్ళి వొస్తాను--" అని బయలుదేరాను.

"వంట ఐపోతోంది - త్వరగా రండి" అంది సత్యవతి తలుపు చాటు నుంచి. ఇంతసేపూ సత్యవతి తలుపు చాటునుంచి ముసలమ్మ కబుర్లు వింటూనే వున్నదన్నమాట! ఆడవాళ్ళ కబుర్లు ఆడవాళ్ళకే బాగుంటయ్యేమో! బహుశా తను వూకొడుతూ వింటూ కూర్చునే ఇబ్బందిని వొదిలించు కునేందుకే బైటికి వెళ్తున్నానని సత్యవతి గ్రహించి వుంటుంది!

నాలుగు బజార్లలోనూ బలాదూర్లు తిరిగి సూర్యుడు నడినెత్తికి వొచ్చాక ఇల్లు జేరాను. భోజనానికి ఆలస్యమైందని నాకు తెలిసినా కావాలనే ఆలస్యం చేశాను- సాధ్యమైనంతవరకూ నాలుగు గోడల మధ్య కాలం గడపకూడదనే నిశ్చయంతో!

"భోజనానికి లేవండి" అంది సత్యవతి, కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళు అందిస్తూ.

"గోపాలాన్ని కూడా రానీ" అన్నాను.

"ఆయన వూళ్ళో లేరు. రేపుకాని రారు" అంది సత్యవతి.

యీ సంగతి మొదటే తెలుస్తే ఏ హోటల్‌కో వెళ్ళేవాడిని. ఆడవాళ్ళ మధ్య అందులోనూ ఎంత బంధువైనా బాగా పరిచయంలేనివారి మధ్య కాలం గడపటం ముళ్ళమీద కూర్చున్నట్లే! ఇప్పుడిక చేసేదేమీ లేదు- కిమ్మనకుండా యీ రెండు రోజులూ ఇక్కడే గడిపి జారుకోవటం తప్పు!

పిండి వంటలతో సహా భోజనం చేశాను. మర్యాద అనుకున్నదానికన్న ఎక్కువగానే వుంది. సత్యవతి బలవంతం మీద పొట్ట పట్టనంతగా తినాల్సి వొచ్చింది. భోజనానంతరం 'మేడమీద పక్క వేశాను--పడుకోండి' అంది సత్యవతి. ఇదివరకు మా ఇంటికి వొచ్చి వుండటం వల్ల ఆమెకు నా అలవాట్లూ, అభిరుచులూ తెలుసనుకుంటాను.

రాత్రి ప్రయాణపు బడలికకు, మత్తుకూడా తోడవటం వల్ల చల్లగాలి శరీరానికి తగులుతూంటే గాఢనిద్ర పట్టింది. కొద్దిగా మెలుకూ వొచ్చింది కాని బద్ధకం వల్ల కదలబుద్ధి కాలేదు. అందుకని పూర్తిగా కళ్ళు మూసుకొని పోనూ లేదు. కళ్ళ ముందు ఖద్దరు సిల్కు చీరె అంచు కదుల్లాడటం, సువాసనలు గదినంతనూ ఆక్రమించి ఉండటంతో బాగా మెలుకూ తెప్పించుకోవాలనే కుతూహలం నన్ను ముంచెత్తింది. కాని ఒక్కసారిగా లేస్తే యీ వాతావరణం డిస్టర్బ్ అవుతుందేమోనన్న భయంతో కదలకుండా కళ్ళు తెరిచాను. నా కాళ్ళ కట్ట దగ్గర సత్యవతి కూర్చొని వుంది. తీవ్రతను కోల్పోయిన సూర్యకిరణాలు నున్నగా దువ్విన ఆమె తల మీది నుంచి జారుకుంటున్నవి. కిటికీలోంచి వొచ్చేగాలికి పాముపొరలాటి ఆమె చీర కొంగులు రెపరెపలాడుతున్నవి. సత్యవతిని ఇంత సమీపం నుంచి ఇదివరకెన్నడూ చూడలేదు. మొత్తం మీద ఆమె సాధారణ అందగత్తె కాదనే విషయాన్ని యీ క్షణంలోనే తెలుసుకో గలిగాను.

ఆమె ఏదో చదువుకుంటోంది. పెద్ద పెద్ద కళ్ళు, ఆమె చదివే పుస్తకం మీదనే కేంద్రీకరించబడి ఉన్నప్పటికీ కళ్ళలోని వెలుగు నాకు కనిపిస్తూనే వుంది. యీమె ఇక్కడ ఎందుకు వున్నట్లు? నా కోసమేనా? నన్ను లేపేందుకు ఇష్టంలేక నా కోసమై వేచి కూర్చున్నదేమో? అపరిచితులనే భావంతో నే నెంత దూర దూరంగా వుండాలనుకుంటున్నానో పరిచితులనే నమ్మకంతో ఆమె మరింత దగ్గర కావాలనే ఆశయాన్ని ప్రతి సంఘటనలోనూ వ్యక్తపరుస్తూనే వుంది. మత్తయితే వొదిలింది కాని ఇది ఉదయమో సాయంత్రమో చప్పున తెలుసుకోలేకపొయ్యాను. ఆ తరువాత జాగర్తగా జ్ఞాపకం చేసుకొని ఇక యీ ఇబ్బందైన సంఘటనను ఒక వొద్దు పట్టిద్దామని లేచి కూర్చున్నాను.

నేను లేవగానే ఆమె సిగ్గుతో చప్పున తలుపు చాటుకు పోతుందనుకున్నాను. కాని అలాటిదేమీ జరగలేదు. ఆప్తుని దగ్గర అనవసరంగా సిగ్గుపడ నక్కర్లేదన్నట్టుగా ఆమె "ఆ పక్కన నీళ్ళూ, సబ్బూ ఉన్నవి. మొహం కడుక్కరండి....ఫలహారం ఆరిపోతోంది" అంది తుండుగుడ్డ అందిస్తూ.

మొహం తుడుచుకుంటూ ప్రవేశించేప్పటికి ఆమె నలుగురు మనుషులకు సరిపడే ఫలహారాన్ని వెండిపళ్ళెంతోసహా అందించింది.

"పొట్ట పట్టాలనేనా?" అన్నాను.

"ఫర్వాలేదు--తినండి."

"ఎట్లా?...నా వల్ల కాదు."

"మాటిమాటికీ నేనెక్కడ బతిమాలేది? తమ దయ వచ్చినంత వరకే తినండి...కాఫీ తీసుకొస్తాను" అని ఆమె కిందికి వెళ్ళింది.

ఆమె ఇంత స్వతంత్రం తీసుకోవటం ఒక విధంగా నాకు సహాయకారే ఐంది. అపరిచితుల మధ్య ఎలాగా కాలం గడపటమని భయపడుతున్న నాకు ఆమె తీసుకునే స్వాతంత్ర్యం వాతావరణాన్ని చాలా తేలిక చేసింది...మంచిదే! కాని వేరొక దృష్టితో చూస్తే ఆమె ఇంత స్వాతంత్ర్యాన్ని తీసుకోవటం మెచ్చుకోదగ్గ విషయమా అనే భావన కలిగింది. మొగవాణ్ని నేనే జారుకుంటూ వుంటే ఆమె ఎంతో ఆప్తురాలివలె నా దగ్గర ప్రవర్తించటం - ఒక విధంగా ఆమెను అపార్థం చేసుకునేందుకు అనుకూలిస్తోంది. కాని సత్యవతిలాంటి స్త్రీ పట్ల నా కిలాంటి అభిప్రాయం కలగటం అన్యాయమేనని నా అంతరాత్మ ఘోషించటంతో ఆమె తత్వమే అంత అని సరిపెట్టుకున్నాను.

కాఫీ పూర్తి చేసి బైటికి పోతూంటే "కొంచెం త్వరగా రండి...ముసలమ్మ ఆలస్యాన్ని భరించదు" అంది సత్యవతి.

యీ మాటల మీద నాలో నేను తర్కించుకున్నాను. ముసలమ్మకు ఆలస్యమేమిటి? ఆమె త్వరగానే భోంచేసి పడుకుంటే సరిపోతుంది. లేక యీ ఆలస్యం తనకైతే ముసలమ్మను అడ్డంపెట్టుకొని సత్యవతి మాట్లాడుతోందేమో?

జవాబు చెప్పకుండానే బైటపడ్డాను. సత్యవతి మాటల ధోరణి నా ఆలోచనలన్నిటినీ ఆక్రమించుకుంది...ఆమె ఆంతర్యం అంతు పట్టక వేధించసాగింది... ఆమె నన్ను ఏ విధంగా భావించినా నాకు ఏ స్థానాన్ని ఇచ్చినా ఇదమిత్థంగా ఆమెను అర్థం చేసుకునేందుకు ఎంత ప్రయత్నించినా సాధ్యం కావటంలేదు.

రాత్రి తొమ్మిదింటికి కొంప జేరాను. అప్పటికే ముసలమ్మ సావిట్లో దుప్పటి కప్పుకొని నిద్రిస్తూ వుంది. ఇంతకుముందుగానే మొదలైన వర్షాన్ని లెక్కచెయ్యకుండా రావటంలో నేను పూర్తిగా తడిసిపొయ్యాను.

సత్యవతి తలుపు తీస్తూనే నన్ను ఎగాదిగా చూసి ఫకాలున నవ్వుతూ "ఇక స్నానం చెయ్యనక్కర్లేదు...ఆగండి. ఇల్లంతా మడుగవుతుంది" అని చప్పున తుండుగుడ్డ అందించింది. తడి గుడ్డలు పిండి ఆరేసింది. పొడి గుడ్డలు కట్టుకున్నాను. కాని సత్యవతి నన్ను చాలా తేలిగ్గా మాట్లాడ గలుగుతోందనే నమ్మకం నాలో మరింతగా పాతుకుంది. ఆమె తత్వాన్ని ఇందుకు కారణంగా తీసుకునేందుకు నాకు మనసొప్పటం లేదు. మరో విశేషమేమంటే - తాను ముందుగా నా పట్ల తీసుకున్న స్వాతంత్ర్యాన్ని నేను అభినందిస్తున్నానా లేదా అనే విచక్షణే ఆమెలో కనిపించటం లేదు. ఆమె ధోరణిని

నేను రిసీవ్ చేసుకున్నట్లు కనిపించనప్పటికీ ఆమెలో మార్పు రాకుండటం నాకు మరీ ఆశ్చర్యంగా వుంది. ఒకవేళ ఆమె అమాయకురాలనుకునేందుకు వీల్లేదు. ఆమె తెలివిగల స్త్రీ అని నమ్మకంగా చెప్పగలను. పోతే మిగిలిందల్లా నాకు అంతుపట్టని కారణమేదో ఉండి ఉండాలి.

భోజనానంతరం మేడ మీద పడకకుర్చీలో నడుం వాల్చి నాకు అంతుపట్టని ఆ కారణాన్ని గూర్చి తిరిగి ఆలోచించసాగాను. నా పట్ల ఆమె అనవసరంగా తీసుకునే 'చనువు' కు నేను బహుశా ఆశ్చర్యంతోనే మౌనం వహించి వూరుకున్నాను. ఔను ఇలాగే ప్రవర్తించినట్లయితే ఆమె మరింతగా పెచ్చుమీరుతుంది. నీ కిది 'తగదు' అని చివాట్లు వేస్తే ఆమెకు నా పట్ల కొత్తగా పెరిగే గౌరవమేమీ వుండదు గాని ప్రవర్తనలో మాత్రం మార్పు వొస్తుంది; యీ పద్ధతి వల్ల ఆమె ఆంతర్యం నాకు తెలిసి రాదు. పోతే నేను కూడా లేని చనువును తీసుకొని ప్రవర్తించినట్లయితే ఆమె కారణం బైటపెట్టక మానదు. ఇది కేవలం చిన్న చేపను ఎరగా వేసి పెద్ద చేపను పట్టినట్టే! యీ నిశ్చయంతో నాకు దొరికే మొట్టమొదటి అవకాశాన్నే వృథాపోనివ్వకూడదనుకున్నాను.

ఆ అవకాశం కూడా త్వరలోనే లభించింది. ఆమె భోజనం చేసి తాంబూలంతో పైకి వొచ్చింది. ఆమె అడుగుల చప్పుడు విని నిద్రిస్తూన్నట్లు నటించాను.

ఆమె నా దగ్గరకు వొచ్చి ఒక్క క్షణం ఆగి "అప్పుడే నిద్రా" అంది.

యీ దొంగ నిద్ర నుంచి మేల్కొనకపోతే ఆమె వెళ్ళిపోతుందేమోనన్న భయంతో ఉలిక్కిపడి లేచినట్లు నటించాను.

"ఏమిటీ?" అన్నాను, అంతకుపూర్వం ఆమె మాట్లాడిన మాటలేవీ నాకు వినిపించనట్లు.

"ఏమీ లేదు...అప్పుడే నిద్రపోతున్నారా లేక నిద్రపోతూన్నట్లు నటిస్తున్నారా అని..."

"ఆ నటనలు నీకు చేతనైనట్లు నాకు చేతకావొద్దూ?" అన్నాను.

ఆమెకు ఏదో దెబ్బ తగిలినట్లయింది. తను అనుకోని విధంగా నేను ప్రవర్తించినట్లుగా చూసింది.

"నటనలు మీకు చేతకాకపోవటమేమిటి? మా అక్క వెర్రిది కనుక ఆమెకు తెలియకపోవచ్చు--" అంది గుక్క తిప్పుకొని.

ఏదో గూఢార్థంలో అంటోంది...నాకు అంతుపట్టలేదు. ఐనా సంభాషణ సాగేందుకని "నీ నటనలు తెలుస్తూనే ఉన్నవిగా...నువ్వయితే నేను సన్యాసం పుచ్చుకునేవాడిని!"

"అబ్బో! మా నటనలు, మీ నటనలతో సాటా యేమిటి? పెద్ద నటీమణుల దగ్గరే అనుభవాన్ని సంపాదించినవారు!" అని ఇప్పటికైనా అర్థమైందా అన్నట్లు నా వైపు చూస్తూ తాంబూలాన్ని అందించింది.

నిజానికి నాకు అర్థమైంది. కాని నేను ఏ విషయం మీద ఆమె గురిచూస్తూ వున్నదనుకున్నానో, ఆ విషయాన్నే ఉద్దేశించిందా, లేక ఏదో గుడ్డేటుగా అనేసిందా అనే అనుమానం వహిస్తే ఆ నేరాన్ని ఒప్పుకున్నట్లే అవుతుంది. కనుక ఆమెను పెడదారి పట్టించటమూ, అమాయకత్వాన్ని నటించి దూసుకోవటమూ మంచి పద్ధతులుగా కనిపించినవి.

"నువ్వనేది నాకు అర్థమవటంలేదు."

"అవదు! అర్థం చేసుకోకూడదని మొండిపట్టు పడితే ఎలా అర్థమౌతుందీ?" పాతంరాని కుర్రాణ్ని తల్లి ఎత్తిపొడుపుగా మాట్లాడే స్వరం ఆ మాటల్లో వినిపించింది.

"పోనీ కాస్త విశదపరచరాదూ?"

"నాకెందుకులెండి - మధ్య?" అని వెళ్ళిపోబోయింది. ఇదివరకున్న సందిగ్ధంలో నన్ను పడేసి నా మనోవేదనతో నన్నే చావమని ఆమె వెళ్ళిపోబోతోంది. ఆమెను బతిమాలో భంగపడో ఆమె మనసులోని మాటల్ని విని తీరాలి. అందుకనే చప్పున ఆమె చెయ్యి పట్టుకున్నాను.

"సత్యవతీ! మాట...ఇప్పుడే వెళ్ళిపోవొచ్చు. ఇట్లారా...కూర్చో చెప్పు. నాకు చెప్పవూ?" అని ఆమె గడ్డం పట్టుకొని బతిమాలసాగాను.

ఆమెను తాకుతున్నాననే భావమే నాలో కలగలేదు. ఆమెను వేడుకుంటూ మరింతగా నన్ను నేను తక్కువచేసుకుంటున్నాననే ఆలోచనే నాకు పోలేదు. కాని యీ నా అవస్థను ఆమె అర్థం చేసుకుందనుకుంటాను.

"ఊరుకోండి....ముందు అలా కూర్చోండి" అని ఆమె అనేవరకూ నేను అనవసరంగా నాకు తెలియకుండానే పొరపాటు చేశానని తెలుసుకోలేక పోయాను.

ఆమె ఆజ్ఞ ప్రకారమే కొంచెం దూరంగా కూర్చొని "ఇక చెప్పు--" అన్నాను.

"మీరేమన్నా అనుకుంటారు--" అందామె.

నేను నిజంగా అనుకోవాలనే ఆమె గురి! నేను ఏమైనా అనుకుంటాననే భావం ఆమెకు కలిగినట్లయితే అసలు ఆమె బైటపెట్టదలుచుకున్న మాటల్లోని ఏ భాగాన్నీ సూచనగా కూడా ఆమె వ్యక్తీకరించేది కాదు. తనకు తెలిసినా తెలియనట్లే నటించి ఉండాల్సింది. కనుక ఎక్కువ శ్రమపడకుండానే ఆమెచేత మాట్లాడించగలననే ధైర్యం వొచ్చింది.

"నేనేమీ అనుకోను - చెప్పు" అన్నాను.

"ఏమీ తెలియనట్లుగా నా చేతనే చెప్పించాలని చూస్తారేమిటండీ?"

"నాకు నిజంగా తెలిసే ఉండొచ్చు. కాని నాకు తెలిసిన అనేక సంఘటనల్లో ఏ సంఘటనను నువ్వు ఉద్దేశిస్తున్నావో నాకు ఎలా తెలుస్తుంది?"

"ఓహో! నేను అదొక్కటే సందర్భం అనుకున్నాను. కాని అలాటివే ఇంకా అనేకం ఉండొచ్చన్నమాట...నిజం దానంతటదే బైటపడుతూంటుంది" అని నవ్వింది.

"నన్ను చంపక చెపుదూ--"

ఆమె ఒక్క క్షణం వూరుకుంది. ఏ విధంగా చెప్పాలా ఆలోచించుకునేందుకేమో? నేను కూడా ఆతృతగా వున్నాను.

'--పెద్దవిషయం కాదనుకోండి. ఆ నీలవేణితో తమ సంబంధం--"

"నీలవేణి ఎవరూ?"

"అప్పుడే ఏమీ తెలియనట్లుగా నటన మొదలెట్టారూ? ఆ సినిమా నటీమణిని ఎరగరండీ!"

గతుక్కుమన్నాను. యీమెను కదపకుండా వూరుకున్నా పొయ్యేది. తీగ కదిపితే కంపంతా కదిలినట్లయింది. ఐతే ఆ సంగతి ఈమె కెలా తెలిసిందో? ఏమైనా తెలియనట్లుగానే ఎత్తువేసి, అమాయకత్వంతో ఆమె విన్నది తప్పనే అభిప్రాయాన్ని ఒప్పించేందుకు ప్రయత్నించేందుకు త్వరపడ్డాను.

"ఎవరు చెప్పారూ?" అన్నాను.

"అదంతా ఎందుకులెండి! ఎవరైతేనేం--"

"కాదు...చూడు సత్యవతీ! పెద్ద పట్టణాల్లో ఆడవాళ్ళూ, మగవాళ్ళూ కలిసి తిరుగుతారు, అంతమాత్రంచేత వాళ్ళమధ్య సంబంధాలు కట్టటం తగనిపని--"

"నాకు తెలుసులెండి. మీ యెత్తులు నా దగ్గర సాగవు."

"ఇందులో ఎత్తులేమున్నాయి? ఎవరో అనుకుంటుండగా నువ్వు వినివుంటావు. ఆ అనుకునేవాళ్లు కూడా యీర్ష్య వల్లకానీ, వారికి వేరే పనంటూ ఉండక పోవటం వల్లకానీ ఈ దుష్ప్రచారాలను చేస్తుంటారు. నువ్వది నమ్మి నన్ను ఎగతాళిచేస్తున్నావ్ అంతేనా?" అన్నాను.

"నాకు తెలుసు మీరిలా దబాయిస్తారని. ఏదో గాలి కబుర్లు నమ్మి నేను అనటం లేదు. అక్కయ్య- నీలవేణి అమ్మగారు స్వహస్తంతో రాసిన ప్రణయలేఖను నాకు చూపారు!"

నా గొయ్యి నేనే తవ్వుకున్నట్లయింది. నేనిక మాట్లాడేందుకు ఏమీ మిగల్చకుండానే సత్యవతి తేల్చిపారేసింది. విధిలేక మెడ వేళ్ళాడేశాను.

"తమ సందేహాలన్నీ తీరినట్లేనా బావగారూ?" అని నవ్వింది. ఆమె దృష్టిలో ఎంత అలుసయ్యాను!

నీలవేణి సంగతి సత్యవతికి తెలిసిందనేది నాకెంత వార్తగా వుందో, నా భార్యకు తెలిసిందనటం కూడా అంత వార్తగానూ వుంది! ఎంత జాగర్త పడ్డా పొరపాటున ఆ వుత్తరమేదో నా భార్య కళ్ళ పడటం దురదృష్టం! ఐతే యీ విషయాన్ని నా భార్య ఎన్నడూ నన్నడగలేదు...మరి యీ సత్యవతి ఎందుకు అడగాలీ?

"మీ అక్కయ్య నిన్ను అడగమన్నదా?" అన్నాను.

"ఆమె ఎందుకు చెపుతుందీ! మహాఇల్లాలు కనుక పాతివ్రత్య ధర్మ రీత్యా సహించి వూరుకుంది...నేనే అడగాలనుకున్నాను...చూడండి--మనిషి కాలుజారటాన్ని గూర్చి నేను విశాలంగా ఆలోచించగలను--"

రక్షించింది. ఆమె అనే ఆ విశాలత్వమే ఆధారంగా నా తప్పును కొంత వరకూ మరుగుపరచగలను.

"మరి తెలిసివుండి కూడా--"

"ఉండండి. మానవుడికి దౌర్బల్యం ఉండదని కాదు. కాని విజ్ఞులు చాలావరకు ఆ దౌర్బల్యాన్ని ప్రతిఘటిస్తూనే కాలం గడుపుతారు--"

"నేను నువ్వనుకున్నంత విజ్ఞుణ్ని కాదు. లోకంలో ఎంత గొప్పవాడైనా సరే స్త్రీ దగ్గర మాత్రం తనలోని అల్పత్వాన్ని ప్రదర్శించక తప్పదు--" అన్నాను.

ఆమె కళ్లు వికసించినవి. సూటిగా నాలోకి చూసింది.

"అదికాదు....మీరన్నది కూడా ఒప్పుకుంటాను. కాని ప్రతి స్త్రీ దగ్గరానా?" అని ఎదురు ప్రశ్న వేసింది.

"అని నువ్వెలా అనుకున్నావూ?" అన్నాను.

"ఇందాక మీరే అంటిరి--కొన్ని సంఘటనలు నాకు తెలుసు. అందులో నువ్వు దేన్ని ఉద్దేశిస్తున్నావో తెలియటం లేదు అని. దాన్ని బట్టి కొంత వరకూ అనుకున్నాను. పోతే సమాజంలో గౌరవ మర్యాదల్తో బతుకుతూన్నప్పుడు దేశమంతా పేరుపడ్డ ఆమెతో--"

"ఆమె నీ దృష్టిలో అంత తక్కువదా?"

"పొరపాటేలెండి...మీ ప్రియురాలు కదూ! కాని నేను చెప్పదలుచుకున్నది చెప్పనివ్వండి. ఆమె వ్యభిచారిణిగా ఈ వూళ్ళో జీవించటం అందరికీ తెలిసిందే! కాలఖర్మవశాత్తూ ఆమె ఈనాడు పెద్ద తారయింది. ఎంతో సంపాయించింది. ఐశ్వర్యం వుందేకాని మర్యాద ఎలా పెరుగుతుందండీ? ఆమెను మన ఇళ్ళకు తీసుకొచ్చి సహపంక్తిన భోజనం పెట్టగలమా? ఆమె ధనంవల్లనైతేనేం నటనాకౌశలం వల్లనైతేనేం

ఎంతోమంది మన్ననలకు పాత్రురాలు కావొచ్చు. కాని సామాజికంగా ఆమె విలువ ప్రతివారికీ తెలుసు. ఇక ఆమెతోడి స్నేహాన్ని సంపాయించిన మీ చరిత్ర కూడా ప్రచారమయేందుకు ఎక్కువ కాలం పట్టదు కదా!"

ఆమె ముఖం కందగడ్డయింది. నేను కాలుజారటంలో ఆమెకు సానుభూతి వుంది. కాని ఆ నీలవేణిలాటి స్త్రీతో మాత్రం కాకుండా ఉన్నట్టయితే సత్యవతికి అభ్యంతరం ఉండేది కాదన్నమాట! నీలవేణి లాటి స్త్రీ తోడి స్నేహం ప్రచారమై నాకు కళంకం రావటాన్ని కూడా సత్యవతి భరించలేదు. ఎందుకంటే కాలుజారటం ఒక తప్పయితే అది ప్రచారం కావటం రెండో తప్పని ఆమె అభిప్రాయం.

"నాకీ చెడు పేరు వొచ్చిందని ఇప్పుడు తెలుసుకున్నాను....కాని అందుకు నేనే బాధ్యుణ్నంటావా?" అన్నాను.

"ఆఁ. అంటాను. కాస్త ఆలోచించి మరీ కాలు జారినట్లయితే యీ చెడు పేరు ఎందుకొస్తుందీ? అందరి వ్యక్తిగత జీవితాలూ బట్టబయలవుతున్నవా?" అంది.

"అంటే--?"

"నేనిక విశదీకరించలేను. మీరే అర్థం చేసుకోగలరు. చేసేది కాస్త చాటుమాటుగా చేస్తే యీ దుష్ప్రచారం అవదుగా?"

సత్యవతి చెప్పినట్లుగా నా యీ ప్రవర్తన బంధువర్గాలలో ఇంకెంతగా ప్రచారమైందో? ఒకవేళ యీ సత్యవతే తనకు తెలిసిన యీ విషయాన్ని ఒకళ్ళిద్దరికి అంటించలేదుకదా? అదంతా అలా వుంచి నా భార్యకు లేని ఈర్ష్య ఈమెకు ఎందుకు కలగాలీ? నా మంచిని గూర్చి చెప్పే ధోరణి కాదది. కేవలం తనకు సంబంధించినదేదో ఇతర్లపాలైనప్పుడు కలిగే ఆందోళన, జుగుప్స, జలసీలు ఆమె ధోరణిలో కనిపిస్తూన్నవి...

బోధి వృక్షం క్రింద కూర్చున్న బుద్ధుడికి ఒక్క క్షణంలో పెద్ద వెలుగు కళ్ళముందు కనిపించి జ్ఞానోదయమైనట్లు నాక్కూడా ఒక్కసారిగా జ్ఞానోదయమైంది. ఆమె అంతర్యం అరటిపండు వొలిచి చేతిలో పెట్టినంత స్పష్టంగా నాకు తెలిసింది. జలసీ ప్రణయానికి అడ్డదారేమో?

ఆ క్షణంలో నాలో కలిగిన ఉద్రేకం, ధైర్యం స్త్రీ పట్ల పురుషుడు ఇష్టానుసారంగా ప్రవర్తించేట్లు చేయగలవనేందుకు నా చేష్టలే తార్కాణం. జడపట్టుకొని ఒక్కసారి గుంజగానే ఆమె నా వొళ్ళో పడింది. తాను శ్రమపడి నన్ను తిప్పలు పెట్టలేదు- తెలివైన సత్యవతి!

తాను కూడా ఒక నేరస్థురాలుగా మారటం వల్ల నీలవేణి పట్ల, నా పట్లా ఆమె అభిప్రాయం ఏమైనప్పటికీ, సత్యవతి ఆ అభిప్రాయాల్ని ఎన్నటికీ వెల్లడించలేదు.

"సత్యవతీ! భలే తెలివిగా కథను తిప్పావ్!" అన్నాను ఆమెను అభినందిస్తూ.

"నేనా?...మీరూ, మీ నీలవేణీ, పట్టుబడని మీ వుత్తరమే ఇంతా చేసినయ్!" అందామె, విజయసూచకంగా నవ్వుతూ.

"ఏమిటీ- ఏం ఉత్తరం?"

"అదేనండీ! అక్కయ్య చూపిందనలా- ఆ ఉత్తరం--"

"ఏమైందీ అది?"

"అసలు నాకు చూపనేలేదు. అసలామె దగ్గర అలాటిది లేనేలేదేమో? నేనే వూహించా. నా వూహ సరైందే కదూ?"

"ఆఁ. చాలా సరిగ్గా అతికింది. ఆడదాని తెలివంటే అలా ఉండాలి!" అన్నాను, జరిగిపోయిన పొరపాటును గూర్చి ఇక ఆలోచించదలచక!

ఆ మూడు నిద్రల అనుభవం - స్త్రీ ఎంత తెలివిగా చాకచక్యంతో పురుషుణ్ని వలలో వేసుకోగలదో నాకు తెలియచెప్పింది... ఆ ఆనందంలో మా ఆవిడ చెప్పిన ఇంగ్లీషు పూల మొక్కల తాలూకు గింజల్ని మరిచిపోవటంలో ఆశ్చర్యం ఏముంటుంది?

*- అక్టోబర్ 1951*